క్లుప్తంగా

30న మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

రేపల్లె: పట్టణంలోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశ మందిరంలో ఈ నెల 30న ఉదయం 12 గంటలకు మునిసిపల్ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కమిషనర్ విజయసారథి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని చెప్పారు.

నేటి నుంచి క్రిస్మస్ నెల ప్రారంభం

పిట్టలవానిపాలెం: క్రిస్మస్ పండగ నెల శనివారం నుంచి ప్రారంభం కానుంది. నవంబర్ 25 నుంచి డిశంబర్ 25 వరకు పండగ నెలగా పిలుస్తారు. మండలంలోని అన్ని గ్రామాలలో గల క్రైస్తవ ప్రార్థన మందిరాలలో శనివారం క్రీస్తు ఆరాధనలు ప్రారంభంకానున్నాయి.

సత్యసాయి తల్లీపిల్లల వైద్యశాలకు భూమి పూజ



పిట్టలవానిపాలెం: ఖాజీపాలెం గ్రామంలోని అరవింద ఆశ్రమంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి 98వ జయంతి సందర్భంగా సద్గురు శ్రీ మధుసూదన్‌సాయి ఆశీస్సులతో ఉచిత 40 పడకల తల్లీపిల్లల ఆసుపత్రి నిర్మాణ పనులకు భూమిపూజ శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ 2024 విజయదశమి నాటికి వైద్యసేవలు ప్రారంభిస్తామని తెలిపారు. ప్రస్తుతం శ్రీ సత్యసాయి వెల్‌నెస్ సెంటర్‌లో ప్రతి రోజూ 60 నుంచి 70 మందికి ఉచిత వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. ఇక్కడ అన్ని రకాల రక్తపరీక్షలు ఉచితంగా నిర్వహించడంతో పాటు మందులు ఉచితంగా అందిస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీసత్యసాయి సుజల స్రవంతి ట్రస్టు సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

తైక్వాండో క్రీడాకారిణికి అభినందన



భట్టిప్రోలు: రైల్వే కోడూరులో నిర్వహించిన రాష్ట్రస్థాయి తైక్వాండోలో అండర్–17 బాలికల విభాగంలో భట్టిప్రోలు సిద్ధార్థ హైస్కూల్‌లో 9వ తరగతి విద్యార్థిని గూడవల్లి తేజశ్రీ మణి రజత పతకం సాధించింది. శుక్రవారం స్థానిక హైస్కూల్‌లో తేజశ్రీ మణిని ప్రిన్సిపల్ వి. నాగేశ్వరరావు, ప్రధానోపాధ్యాయులు వి.భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

శివాలయాల్లో విశేష పూజలు



భట్టిప్రోలు: కార్తిక మాసం పురస్కరించుకుని భట్టిప్రోలులోని శివాలయాల్లో విశేష పూజలు జరుగుతున్నాయి. పెద పులివర్రు శ్రీ రాజరాజ నరేంద్ర స్వామి దేవాలయంలో స్వామి వారికి శుక్రవారం ప్రాతః కాలంలో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం దివ్య సువర్ణ కాంతులతో మారేడు పుష్పమాలాంకృత రజత నాగాభరణ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భట్టిప్రోలులోని దేవతల గుడిగా ప్రసిద్ధి గాంచిన విశలేశ్వర స్వామి, హేమ విశలేశ్వరస్వామి, భ్రమరాంబ మల్లేశ్వరస్వామి, ఐలవరం రామలింగేశ్వర స్వామి, వెల్లటూరు అగస్త్యేశ్వరస్వామి పలు దేవాలయాల్లో అభిషేకాలు ప్రాతఃకాలంలో జరుగుతున్నాయి. పూజా కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

జీవ పరిణామంపై అవగాహన



బాపట్ల అర్బన్: మానవజాతుల పుట్టుక పరిణామాలపై డార్విన్ సిద్ధాంతంపై జన విజ్ఞాన వేదిక, సాంస్కృతిక విభాగం రాష్ట్ర నాయకుడు కోటా వెంకటేశ్వరరెడ్డి విద్యార్థులకు వివరించారు. జీవజాతుల పుట్టుక గ్రంథం ప్రచురణ దినోత్సవ సందర్భంగా జన విజ్ఞాన వేదిక సాంస్కృతి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం బాపట్ల విజయలక్ష్మి పురంలోని స్వర్గీయ డాక్టర్ దొప్పలపూడి మల్లికార్జునరావు చార్లెస్ డార్విన్ గార్డెన్‌లో మున్సిపల్ ఎలిమెంటరీ స్కూల్ విద్యార్థులు గార్డెన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ కారుమంచి విజయకుమార్ మానవ పుట్టుక పరిణామ సిద్ధాంతంపై విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దొప్పలపూడి రామ్మోహనరావు ప్రధానోపాధ్యాయులు దుర్గాదేవి ప్రగతి స్కూల్ చెందిన విద్యార్థిని విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దేశానికి ఆదర్శం జగనన్న పాలన



అరవల్లిలో అభివృద్ధి క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు



సూరేపల్లిలో సంక్షేమ బోర్డు ఆవిష్కరణ



అనంతవరంలో సంక్షేమ పథకాల బోర్డు ఆవిష్కరణ

రేపల్లె రూరల్: దేశానికి ఆదర్శంగా జగనన్న సంక్షేమ పాలన నిలిచిందని వైఎస్సార్ సీపీ రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్యబాబు అన్నారు. అరవపల్లి గ్రామంలో శుక్రవారం నిర్వహించిన వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలనలో ఎటువంటి అవక తవకలకు తావివ్వకుండా సచివాలయ వ్యవస్థతో పారదర్శకంగా చేస్తున్నారన్నారు. పేదవాని ఆర్థిక భద్రతే లక్ష్యంగా పాలన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన అభివృద్ధి కార్యక్రమాల క్యాలెండర్‌లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య, సర్పంచ్ లోయా బాబూనాంచారయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు బొర్రా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.94.59 కోట్ల సంక్షేమ లబ్ధి

భట్టిప్రోలు: సూరేపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం " వై ఏపీ నీడ్స్ జగన్ " కార్యక్రమం సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ప్రధాన కూడలిలో వైఎస్సార్ సీపీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో నవరత్నాల లబ్ధిదారుల డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ప్రారంభించారు. ఈ సచివాలయం పరిధిలో డీబీటీ, నాన్ డీబీటీ రూపేణా రూ.94.59 కోట్లు ప్రజలు లబ్ధి పొందినట్లు ఈవోపీఆర్డీ, నోడల్ ఆఫీసర్ టి. ఉషారాణి తెలిపారు. ఈ కార్యక్రమంలోఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల బాలాజీ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నానీ), మండల జేసీఎస్ కన్వీనర్ గోవర్ధనగిరి చినబుజ్జి, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ సలీమ్, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, ఎంపీటీసీ సభ్యురాలు రావు రాజేశ్వరి, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు

అనంతవరంలో రూ. 22.79 కోట్లు పంపిణీ

కొల్లూరు: సంక్షేమ పథకాలతో లబ్ధిదారుల కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతోందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సూర్యదేవర రామకృష్ణ అన్నారు. శుక్రవారం అనంతవరం సచివాలయం వద్ద వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాల వివరాలను తెలిపే బోర్డును ఆవిష్కరించారు. సచివాలయం పరిధిలో రూ. 22.79 కోట్లు సంక్షేమ పథకాల రూపంలో పంపిణీ చేసినట్లు తెలిపారు. వైస్ ఎంపీపీ మురాల రాంబాబు, కో–ఆప్షన్ సభ్యుడు షేక్ బాజీ, ఈఓపీఆర్‌డీ సీహెచ్ రవిబాబు, కార్యదర్శి మణిరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు దూళిపాళ్ల రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

బలిజేపల్లి(వేమూరు): పేదల అభ్యున్నతి, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ వల్లే సాధ్యమని వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బొల్లిముంత ఏడుకొండలు అన్నారు. మండలంలోని బలిజేపల్లి గ్రామ సచివాలయంలో వై ఏపీ నీడ్స్ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బలిజేపల్లి గ్రామంలో వివిధ సంక్షేమ పథకాలు ద్వారా లబ్ధిదారుల ఖాతాలో రూ 22,40,99,655లు జమ చేయడం జరిగిందన్నారు. నాన్ డీబీటీ ద్వారా రూ.4,69,459.45లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొజ్జ వెంకయ్య, దాది సుబ్బారావు, మాజీ సర్పంచ్ రాయపూడి బుజ్జిబాబు, సాంబశివరావు, రాయపూడి వాసు, వలంటర్లు పాల్గొన్నారు.

నేడు ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమం

పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం గ్రామంలో శనివారం ఏపీకి జగనే ఎందుకు కావాలి అనే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి చోడిపాలెం గ్రామంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పించి, పార్టీ జెండాను ఆవిష్కరిస్తారని తెలిపారు. ఎస్సీ కాలనీలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించి, మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేడు బీఎఫ్ఏ సేవా కార్యక్రమాలు

భట్టిప్రోలు: భట్టిప్రోలు ఫ్రెండ్స్ అసోసియేషన్(బీఎఫ్ఏ) ఆధ్వర్యంలో శనివారం పంచాయతీ పరిధిలోని రహదారుల వెంట, దేవాలయాలు, శ్మశాన వాటికల్లో 200 మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటికి ట్రీ గార్డ్ కూడా ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎంతో కాలంగా భట్టిప్రోలు బస్టాండ్ సెంటర్‌లో మరుగుదొడ్ల సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వాటి నిర్మాణానికి కూడా శంకుస్థాపన చేయనున్నట్లు పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా బీఎఫ్ఏ అధ్యక్షుడు బి.గోపీనాథ్ విచ్చేయనున్నట్లు తెలిపారు.

30న సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

బాపట్ల అర్బన్: బాపట్ల కోన ప్రభాకరరావు కళాక్షేత్రం (టౌన్ హాల్)లో ఈ నెల 30న ఉదయం 8 గంటల నుంచి వార్షిక ఉచిత సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నట్లు కన్వీనర్ నెమలికంటి హనుమంతరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రమైన కార్తిక మాసంలో గత పుష్కర కాలంగా భావపురి భక్త బృందం, శ్రీ లలితా త్రిపుర సుందరీ పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ముత్తేవి శ్రీనివాస శశికాంత్ బృందంతో ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పళ్లెం, గ్లాసు, ఉద్ధరిణె, కలశం చెంబు, రెండు కొబ్బరికాయలు, విడిపూలు తెచ్చుకోవాలన్నారు. మిగతా పూజాద్రవ్యాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 28 లోపు టోకెన్లు పొందాలన్నారు. వివరాలకు మేడూరి అప్పలాచార్యులు 9346478011, కొల్లిపర ప్రసాద్(అగ్రహారం శివాలయం): 9866084452, రొంపిచర్ల కేశవాచార్యులు:7386444371. నాళం శ్రీనివాస్: 8121445989 సంప్రదించాలన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' క్రీడలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లలిత కుమారి



కార్యదర్శులతో మాట్లాడుతున్న డీపీఓ రాంబాబు

భట్టిప్రోలు: గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా అనే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయ భాస్కరి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో క్రీడల నిర్వహణ తేదీలు, విధి విధానాలపై అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ క్రికెట్, బ్యాడ్మింటన్, ఖోఖో, వాలీబాల్, కబడ్డీ క్రీడల్లో పాల్గొనేందుకు ఈ నెల 27 నుంచి సచివాలయాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారికి టీ షర్ట్స్, క్యాప్‌లు ఉచితంగా అందిస్తారని తెలిపారు. సచివాలయ, మండల, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఈ పోటీలు జరుగుతాయని అన్నారు. సమావేశంలో తహసీల్దార్ ధూళిపూడి వెంకటేశ్వరరావు, గుమ్మా చంద్రశేఖరరావు, కో–ఆప్షన్ సభ్యులు షేక్ సలీం, ఎంఈవో ఎస్.దేవరాజ్, మెడికల్ ఆఫీసర్ చావలి రామలక్ష్మి, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

కర్లపాలెం: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడల పోటీలను నిర్వహణకు ఏర్పాట్లు సిద్ధం చేయాలని బాపట్ల డీపీవో, కర్లపాలెం ఎంపీడీవో దాసరి రాంబాబు అన్నారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో డిసెంబర్ 15 నుంచి జనవరి 26 వరకు గ్రామీణ క్రీడా పోటీలు జరుగుతాయని చెప్పారు. గ్రామాలలో 15సంవత్సరాలు నిండిన వారందరూ ఆటల పోటీలలో పాల్గొనవచ్చునని తమ పేర్లు ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని చెప్పారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహిస్తారని రాంబాబు తెలిపారు.

మద్యం విక్రయంపై కేసు నమోదు

కర్లపాలెం: బెల్ట్‌షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బాపట్ల సెబ్ సీఐ శ్రీనివాసులు అన్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు తుమ్మలపల్లి పంచాయతీ పరిధిలోని యాదవ పాలెం గ్రామంలో బుర్ల పోలేరమ్మ చిల్లర కొట్టులో సోదాలు నిర్వహించగా ఐదు బీరు బాటిళ్లు లభ్యం కావటంతో సీజ్‌చేసి పోలేరమ్మపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

కొల్లూరు: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు కొల్లూరు పోలీసులు తెలిపారు. పెసర్లంక కృష్ణానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వేమూరు ఎస్ఈబీ అధికారులు నిఘా ఏర్పాటు చేశారు. క్రాప అడ్డరోడ్డు సమీపంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ సిబ్బంది స్వాధీనం చేసుకుని, కొల్లూరు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఎస్ఈబీ అధికారులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జి. రాజ్యలక్ష్మి తెలిపారు.

కాలువలో బోల్తాపడిన కారు



కర్లపాలెం: ప్రమాదవ శాత్తు ఓ కారు కర్లపాలెంలోని లంకచానల్‌లో(కాలువ) గురువారం రాత్రి బోల్తా పడిన సంఘటన చోటు చేసుకుంది. కర్లపాలెం పోలీసులు తెలిపిన వివరాల మేరకు పొన్నూరు గ్రామానికి చెందిన నంబూరు ఆదర్శ్ పిట్టలవానిపాలెం మండలంలోని చందోలు గ్రామంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చి తిరిగి తమ బంధువుల వ్యక్తిని బాపట్లలో దించి పొన్నూరు వెళ్లేందుకు కర్లపాలెం వైపు వస్తుండగా ఆదర్శ్‌కు నిద్ర మత్తు రావటంతో కారు అదుపుతప్పి లంక కాలువలో బోల్తాపడినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇరువురు డోర్లు తీసుకుని బయటకు వచ్చారని స్వల్ప గాయాలు తప్ప ఎలాంటి ప్రమాదం జరగలేదని తెలిపారు. ప్రమాదానికి గురైన కారును స్థానికుల సహాయంతో కాలువలో నుంచి బయటకు తీయించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

ఉత్సాహంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు



సూరేపల్లి విద్యార్థులకు ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేస్తున్న హెచ్‌ఎం అరుణకుమారి

వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు మండల స్థాయి క్విజ్ పోటీలు నిర్వహించారు. ఏపీ ఎస్ఎస్‌టీఎఫ్(ఆంధ్రప్రదేశ్ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరమ్) ఆధ్వర్యంలో ఇంటరాక్టివ్ క్విజ్ కానిస్టిట్యూషన్ డే, సాంఘిక శాస్త్ర దినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని కె. అరుణకుమారి మాట్లాడుతూ క్విజ్ పోటీల వల్ల విద్యార్థుల్లో పోటీ తత్వం అలవడమే కాక, భవిష్యత్తులో మరింతగా రాణించే అవకాశం ఉందని తెలిపారు. ఈ పోటీలను సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుర్రం మురళీమోహన్, ఎస్కే సుభానీ నిర్వహించారు. ఈ పోటీలకు 7 హైస్కూళ్ల నుంచి విద్యార్థులు హాజరయ్యారు. ఈ పోటీలలో సూరేపల్లి వీపీ అండ్ జీఎస్‌ఎం హైస్కూల్‌కు చెందిన మురాల రోహిత్, పెనుమాల ఆదర్శబాబు, దాసరి అమర్ అభిషేక్, ఉయ్యూరు చైతన్య టీమ్ ప్రథమ స్థానం, భట్టిప్రోలు సిద్ధార్థ హైస్కూల్‌కు చెందిన జి. అక్షర లక్ష్మి, కె. సంజన, డి.నాగభవాని, డి.కీర్తన టీమ్ ద్వితీయస్థానం, భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌కు చెందిన జి. అవినాష్, కె. ప్రశాంత లక్ష్మి, ఎ. సుధారాణి, డి. సాత్విక టీమ్ తృతీయ స్థానంలో నిలిచారు. వీరిని ఆయా హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు కూచిభొట్ల శ్రీనివాస శర్మ, వి. భారతి, ప్రిన్సిపల్ వి. నాగేశ్వరరావు, చందలూరి రామకోటేశ్వరరావు అభినందించారు.

ఓబీసీలను విస్మరిస్తున్న కేంద్ర ప్రభుత్వం

నెహ్రూనగర్: సమాజంలో వెనకబడిన తరగతుల వారిని సామాజిక సమానత్వం సాధించేందుకు కృషి చేయాల్సిన కేంద్ర ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేశన శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చుట్టుగుంటలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్య, ఉద్యోగాల్లో ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లకు గండి పడేలా కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. ఇందులో ప్రధానంగా ఓబీసీ కుల గణన చేయకపోవడం వల్ల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఈడబ్ల్యూఎస్ కింద అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడం ద్వారా ఓబీసీలకు మరింత అన్యాయం జరుగుతుందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఓబీసీ కుల గణన చేపట్టి జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. క్రిమిలేయర్ పద్ధతిలో రూ. 12 లక్షల ఆదాయం కలిగిన కుటుంబాలు రిజర్వేషన్లు కోల్పోయే అవకాశం ఉందని, విద్యాభివృద్ధిలో నేటి తరానికి అతి పెద్ద అడ్డంకిగా మారిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరువల్ల జాతీయ స్థాయిలో అన్ని రాష్ట్రాల్లో 2016–17 విద్యా సంవత్సరం నుంచి మెడికల్ కోటాలో 15శాతం ఎంబీబీఎస్‌లో, 50 శాతం పీజీలో రిజర్వేషన్లు కోల్పోవాల్సి వస్తుందని వెల్లడించారు. ఓబీసీల ఐక్యత చాటుతూ ఈనెల 27న నెల్లూరు జిల్లా కందుకూరులో బీసీ సభ నిర్వహిస్తున్నామని తెలిపారు. సమావేశంలో సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, రామకృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

రేపు కవి సమ్మేళనం

పాత గుంటూరు: బ్రాడీపేటలోని సీపీఎం కార్యాలయంలో బాపు రమణ, బాలు కళాపీఠం నవ్యాంధ్ర రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కవి సమ్మేళనం జరుగుతుందని నిర్వాహకులు బి.జనార్దన్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ రమణ యశస్వి రచించిన సప్తపదులు పుస్తకావిష్కరణ, అనంతరం సమ్మేళనం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు, కవులు పాల్గొనాలని ఆయన కోరారు.

వైభవంగా కార్తిక ద్వాదశి పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

రేపల్లె: టీటీడీ శ్రీవాణి ట్రస్ట్ సహకారంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పోటుమెరక గ్రామంలో శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం నిర్మించి 16 రోజులు పూర్తయిన సందర్భంగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు రాధాకృష్ణమూర్తి శుక్రవారం కార్తిక ద్వాదశి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చాట్రగడ్డ మాంచాలమ్మ భక్త సమాజం భజన సంకీర్తన కార్యక్రమాలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకర రావు, సభ్యులు కట్టా మహేష్, రేపల్లె చెంచయ్య, సుందర రామరెడ్డి, కామయ్య, నాగరాజు, వాలేశ్వర రావు, లీలాకృష్ణ, లోకేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ ప్రతిభాన్వేషణ పరీక్ష



మాట్లాడుతున్న ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు

కర్లపాలెం: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరగనున్న జాతీయ ప్రతిభాన్వేషణ పరీక్షల సన్నద్ధతకు ఎస్టీయూ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోడల్ గ్రాండ్ టెస్ట్ నిర్వహించటం అభినందనీయమని జిల్లా ఉప విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లు అన్నారు. కర్లపాలెం మండలం యాజలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు జాతీయ ప్రతిభాన్వేషణ మోడల్ టెస్ట్ నిర్వహించారు. అత్యంత ప్రతిభ కనబరిచి ఓడరేవు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని లావణ్య ప్రథమ స్థానం సాధించగా.. ద్వితీయ స్థానంలో నిజాంపట్నం ఉన్నత పాఠశాల విద్యార్థిని వైష్ణవి, తృతీయ స్థానంలో చెరుకుపల్లి ఉన్నత పాఠశాలకు చెందిన చైత్రపూర్ణిమ నిలిచారు. వీరికి ఉప విద్యాశాఖాధికారి బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇవ్వనున్న ప్రతిభా ఉపకార వేతనాలను ఇచ్చేందుకు ఈ నెల 3న 8వ తరగతి విద్యార్థులకు ప్రతిభాన్వేషణ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు 9,10, ఇంటర్ రెండు సంవత్సరాల వరకు ఒక్కొక్క విద్యార్థికి కేంద్ర ప్రభుత్వం సంవత్సరానికి రూ.12వేల చొప్పున ఉపకార వేతనం అందజేస్తుందని ఆయన తెలిపారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆయన కోరారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బడుగు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గుడివాడ అమర్‌నాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంట మార్పిడిపై అవగాహన సదస్సు



పెరవలిలో వరి పంట పరిశీలన చేస్తున్న అధికారులు

పెరవలి(వేమూరు): రబీ సీజన్‌లో రైతులు పంట మార్పిడి చేయాలని జిల్లా వనరులు, శిక్షణ కేంద్రం వ్యవసాయాధికారి ఆర్.వి జయబాబు అన్నారు. మండలంలోని పెరవలి రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే జొన్న, మొక్కజొన్న, అపరాలు పంటలో సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. పెరవలి గ్రామంలో వరి పంటను పరిశీలించారు. సుడి దోమ, మెడ విరుపు నివారణ చర్యలు వివరించారు. ఈ కార్యక్రమంలో డి.నాగార్జున, మండల వ్యవసాయాధికారి చందోలు సునీత పాల్గొన్నారు.

యాంటీబయాటిక్స్ అధిక వినియోగంతో అనర్థాలు

డీఎంహెచ్ఓ డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు



ర్యాలీలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

గుంటూరు మెడికల్: యాంటీబయాటిక్స్ మందులల్ని వైద్యుల సలహా లేకుండా అధికంగా వాడడం వల్ల అనేక అనర్థాలు తలెత్తుతాయని డీఎంహెచ్‌వో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ వారాన్ని పురస్కరించుకొని శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు పాల్గొని ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంటీబయాటిక్స్ వాడడం వల్ల క్రమంగా శరీరంలో వ్యాధినిరోధకశక్తి తగ్గిపోయి మనిషి క్రమంగా బలహీనపడతాడని చెప్పారు. ప్రతీ చిన్న అనారోగ్యానికి యాంటీబయాటిక్స్ వాడాల్సిన అవసరం లేదని సూచించారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని, యాంటీబయాటిక్స్ వినియోగంపై అందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మార్కెట్ సెంటర్‌లోని హిందూ కాలేజీ వరకు నిర్వహించిన ర్యాలీలో వైద్యులు, వైద్య అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.